క్లుప్తంగా

కొత్త ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



ఎస్.అన్నవరంలో ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ సత్యనాగేశ్వరరావు

తుని రూరల్: ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ ఆరోగ్యశ్రీ వైద్యం పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచిందని వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు అన్నారు. మండలంలోని ఎస్.అన్నవరం సచివాలయంలో బుధవారం ప్రత్యేకాధికారి ఎ.శివాజీ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో గ్రామానికి చెందిన 870 కుటుంబాలకు కొత్త ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ వైద్య ఖర్చుల పరిమితిని రూ.25లక్షలకు పెంచడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎంపీటీసీలు వంగలపూడి అప్పారావు, వైఎస్సార్ సీపీ నాయకుడు కుసనం దొరబాబు, కార్యదర్శి మధుశేఖర్ పాల్గొన్నారు.

వికసిత్ భారత్‌పై అవగాహన



ఎస్సార్‌పేటలో వికసిత్ భారత్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోటనందూరు: మండలంలోని ఎస్సార్‌పేట, అప్పలరాజుపేట గ్రామాల్లో ప్రజలకు బుధవారం వికసిత్ భారత్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం గరీబ్ కల్యాణ యోజన, పీఎం ఆవాస్ యోజన, పీఎం ఉజ్వల యోజన, దీన దయాళ్ అంత్యోదయ యోజన, పీఎం కిసాన్ సమ్మాన్ యోజన, పీఎం పోషణ్ అభియాన్, జన్‌ధన్ యోజన, జీవస్ బీమా యోజన తదితర పథకాలపై అధికారులు అవగాహన కల్పించారు. అనంతరం ప్లకార్డులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు నల్లమిల్లి సూర్యకుమారి, రుత్తల రాజేశ్వరి, వికసిత్ భారత్ రాష్ట్ర కో ఆర్డినేటర్ వేటుకూరి సూర్యనారాయణరాజు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ , ఎంఈఓ రామశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం



తునిలో విద్యార్థులకు సూచనలిస్తున్న రవికాంత్

తుని: నిత్యం క్లాసులతో ఒత్తిడికి గురయ్యే విద్యార్థులు సమయ పాలన, క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని హైదరాబాద్‌కు చెందిన ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్ ఎం.రవికాంత్ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. తొమ్మిది, పది తరగతి విద్యార్థుల సందేహాలను ఆయన నివృత్తి చేశారు. విద్యార్థులు బట్టీ విధానానికి స్వస్తి పలికి విషయాన్ని అర్థం చేసుకొని చదవాలన్నారు. స్కూల్ హెచ్ఎం నూకరత్నం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్లపై వ్యర్థాలు వేయవద్దు

తుని: మున్సిపల్ అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు నిరవధిక సమ్మెకు దిగిన కారణంగా ప్రజలు వ్యర్థాలను రోడ్లపై వేయవద్దని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు కోరారు. బుధవారం నుంచి పారిశుధ్య కార్మికులు విధులను బహిష్కరించారు. ఇళ్లు, వ్యాపార సంస్థల్లో వచ్చే రోజువారీ చెత్తను తడి, పొడిగా వేరు చేసి డంపర్ బిన్స్‌లో వేయాలన్నారు. పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మద్యం సీసాల స్వాధీనం

ప్రత్తిపాడు: మండలంలోని ఉద్దండ జగన్నాథపురంలో బెల్ట్ షాపుపై బుధవారం దాడులు చేసినట్టు స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) సీఐ పి.అశోక్ తెలిపారు. ఉద్దండ జగన్నాథపురంలో కడిమి శ్రీనివాసరావు అనే వ్యక్తి మద్యం విక్రయిండగా అదుపులోకి తీసుకుని అతని నుంచి డ్యూటీ పెయిడ్ 15 మద్యం సీసాలతో పాటు ఒక లూజు మద్యం సీసాను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పి.అశోక్ తెలిపారు.

ఉపాధి మేట్‌లకు శిక్షణ

రౌతులపూడి: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ మేట్‌లకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఎంపీడీఓ ఎం.గోవింద్ ఆధ్వర్యంలో మేట్లను పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. మండలంలోని 26 పంచాయితీల పరధిలోని మేట్లకు రోజుకు 40 మంది చొప్పున శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీఓ తెలిపారు. శిక్షణకు మండలంలోని మేట్‌లు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

● మామిడి..
యాజమాన్యంతో అధిక దిగుబడి

- మామిడి సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మేలు
- సకాలంలో సస్యరక్షణ, తెగుళ్ల నివారణ చేపట్టాలంటున్న అధికారులు
- తుని సబ్‌డివిజన్‌లో 7,965 ఎకరాల్లో సాగు



తేటగుంటలో మామిడి తోటకు మందు పిచికారీ చేస్తున్న రైతులు

తుని రూరల్: మామిడి సాగులో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా నాణ్యతమైన అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. సాధారణంగా డిసెంబర్, జనవరి నెలల్లో మామిడిలో పూత, జనవరి, ఫిబ్రవరి నెలల్లో పిందెలు, మార్చి నుంచి కాయలు, పండ్లు లభించాల్సి ఉంది. ఈ సంవత్సరం వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు ఉన్నప్పటికీ ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు మామిడి సాగుకు అనుకూలంగా ఉన్నాయి. జనవరి సమీపిస్తుండడంతో మామిడి చెట్లకు అక్కడక్కడ పూత కనిపిస్తుంది.

జిల్లాలో 18,130 ఎకరాల్లో

కాకినాడ జిల్లాలోని 21 మండలాల్లో మెట్ట, తీర ప్రాంతం విస్తరించి ఉంది. ఈ మండలాల్లో 18,130 ఎకరాల్లో మామిడి తోటలను రైతులు సాగు చేస్తున్నారు. కాగా ఉద్యానశాఖ తుని సబ్‌డివిజన్ ఐదు మండలాల పరిధిలో 7,965 ఎకరాల్లో మామిడి సాగు జరుగుతోంది. మిచాంగ్ తుపాను ప్రభావంతో వీచిన ఈదురు గాలులకు మామిడి చెట్లు దెబ్బతిన్నారు. కాగా ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండడంతో సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు చేపట్టాలని ఉద్యానశాఖ అధికారి జి.విజయలక్ష్మి సూచించారు. రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు మామిడికి అనుకూలంగా ఉన్నాయన్నారు. మామిడి సాగులో తెగుళ్ల నివారణ, యాజమాన్య పద్ధతులను హెచ్ఓ విజయలక్ష్మి వివరించారు.

యాజమాన్య పద్ధతులు ఇలా..

● **పూత రావడానికి..**

మామిడిలో పూత రావడానికి డిసెంబర్, జనవరి నెలల్లో నాలుగు విడతలు మందులు పిచికారీ చేయాలని హెచ్ఓ విజయలక్ష్మి సూచించారు. మొదట విడతలో క్లోరో మూడు మిల్లీ లీటర్లు లేదా కరాటే రెండు మిల్లీ లీటర్లు, సల్ఫర్ రెండు గ్రాములు, 13.0.45 మందు పది గ్రాములు, బోరాన్ రెండు గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. రెండో విడతలో సోలమన్ ఒక మిల్లీ లీటరు లేదా ఇమిడా 0.5 మిల్లీ లీటర్లు, ఆంట్రాకోల్ రెండు గ్రాములు, ప్లానోఫిక్స్ నాలుగు గ్రాములను పది లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. మూడో విడతలో రోజెంట్ రెండు మిల్లీ లీటర్లు, సాఫ్ రెండు గ్రాములు, ప్లానోఫిక్స్ నాలుగు మిల్లీ లీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. నాలుగో విడతలో అస్పేట్ రెండు గ్రాములు, బావిస్టిన్ రెండు గ్రాములు, ప్లానోఫిక్స్ నాలుగు మిల్లీ లీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. మామిడి తోటల్లో చెట్ల కింద శుభ్రంగా ఉంచడం, కలుపు నివారణ చర్యల వల్ల తామర పురుగులు, తేనే మంచు పురుగులు తగ్గించవచ్చన్నారు. క్రిమిసంహారక మందులతో పాటు వేప నూనే కలిపి పిచికారీ చేయాలన్నారు.



రాజులకొత్తూరులో వికసించిన మామిడి పూత

పురుగులు, తెగుళ్ల నివారణ

● **తామర పురుగు**

ఇటీవల కురిసిన వర్షాలకు కొత్తగా చిగురించే ఆకులపై తామర పురుగు చేరి రసాన్ని పీల్చేస్తాయి. లేత చిగురాకులు చిన్నవిగా ఉండి రాలిపోతాయి. పుష్పగుచ్ఛాలపై, పిందెలపై చర్మం గోకి రసం పీల్చడం వల్ల వక్క రంగులో చర్మం బీటలు వారి రాతిమంగు ఏర్పడి మామిడి కాయల నాణ్యత తగ్గిపోతుంది.

నివారణ

తామర పురుగు నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మిల్లీ లీటర్ల మందును లీటరు నీటిలో కలిపి నల్లపూత, పిందెలు ఎదిగే దశలో పిచికారి చేయాలి.

● **తేనెమంచు పురుగు**

తేనేమంచు పురుగులు ఆకుల నుంచి రసం పీల్చేస్తాయి. ఆకులపై విసర్జించిన తియ్యటి జిగురు పదార్థం, నల్లటి బూజులాంటి మసి ఏర్పడుతుంది.

నివారణ

తేనెమంచు పురుగు నివారణకు ఫాస్ఫామిడాన్ 0.5 మిల్లీ లీటర్లు లేదా మోనోక్రోటోఫాస్ 1.5 మిల్లీ లీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పూత, పిందెలు వచ్చే సమయాల్లో చెట్టు మొదళ్లపై, కొమ్మలపై పిచికారీ చేయాలి.

30 శాతం తోటల్లో పూత



వాతావరణం అనుకూలంగా ఉండడంతో ఇప్పటికే 25 నుంచి 30 శాతం తోటల్లో మామిడి పూత కనిపిస్తోంది. యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు పాటించడంతో పాటు మామిడిని ఆశించే తెగుళ్లు, పురుగులను రైతులు సకాలంలో గుర్తించాలి. రైతు భరోసా కేంద్రాల్లో ఉద్యానశాఖ సహాయకులను సంప్రదించి, నివారణకు మందులను తగిన మోతాదులో వాడాలి. అధిక మోతాదులో మందులు వాడితే పెట్టుబడి వృథా అవుతుంది. మంచి రంగు, పరిమాణం గల మామిడి పండ్లకు మంచి గిట్టుబాటు ధర లభిస్తుంది.

– జి.విజయలక్ష్మి, హెచ్ఓ, తుని

పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి



తాడేపల్లిలో మిధున్‌రెడ్డిని కలసిన జాన్ వెస్లీ

జగ్గంపేట: వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని వైఎస్సార్ సీపీ ఉభయగోదావరి జిల్లాల జోనల్ ఇన్‌చార్జి మిథున్‌రెడ్డి, సోషల్ మీడియా స్టేట్ కన్వీనర్ సజ్జల భార్గవ రెడ్డి సూచించారు. జగ్గంపేటకు చెందిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జాన్ వెస్లీ బుధవారం తాడేపల్లిలో వారిని కలిశారు. జగ్గంపేట నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులను వారికి వివరించారు. పార్టీ పటిష్టతకు కృషి చేయాలని వారు జాన్‌వెస్లీకి సూచించారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



చర్చిలో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

జగ్గంపేట: స్థానిక నెహ్రూ కాలనీలోని చర్చిలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ తుమ్మలపల్లి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 100 మంది వృద్ధులు, వితంతువులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వందన్ యూత్ వలంటీర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు పులి ప్రసాద్, క్యాండిల్ యూత్ వాలంటీర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు జుత్తుక నాగేశ్వరరావు, తులా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్తాం



తునిలో మంత్రి దాడిశెట్టి రాజాకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు



శంఖవరంలో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

- రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా

తుని: అంగన్‌వాడీల సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తుని మండలం ఎస్.అన్నవరంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం అంగన్‌వాడీ సిబ్బంది మంత్రి రాజాను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. యూనియన్ నాయకులు ధనలక్ష్మి, మేరీ సమాదానం, లలిత, లోవరత్నం తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తా

శంఖవరం: అంగన్‌వాడీ కార్యకర్తల డిమాండ్ల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత కొన్ని రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళనలు చేస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన అంగన్‌వాడీ సిబ్బంది ఎమ్మెల్యే స్వగ్రామం శంఖవరం వెళ్లి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

సమన్వయంతోనే సమగ్రాభివృద్ధి సాధ్యం

- ఎంపీపీ బొప్పన రాము
- తుని మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ డాక్టర్ రాము

తుని రూరల్: మండలంలోని గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ రాము అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వ్యవసాయం, ఉపాధి, వైద్య, ట్రాన్స్ కో తదితర శాఖల పనితీరు, ప్రగతిపై ఆయన సమీక్షించారు. జనవరి నుంచి రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వారానికి ఒక సచివాలయంలో పరిధిలో ఏర్పాటు చేస్తున్నట్టు తేటగుంట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రామానాయుడు తెలిపారు. మిచాంగ్ తుపాను కారణంగా కురిసిన వర్షాలకు మండలంలో 1153 మంది రైతులకు పంట నష్టం వాటిల్లిందని ఏఓ అశోక్‌కుమార్ తెలిపారు. జనవరి మొదటి వారంలో పంట నష్ట పరిహారాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 4.17 లక్షల పని దినాలను ఉపాధి కూలీలకు కల్పించినట్టు ఏపీఓ పి.నారాయణరావు తెలిపారు. రైతుల ప్రయోజనాలకు అనువుగా ఉపాధి పనులు గుర్తించి చేస్తున్నట్టు చెప్పారు. ఉద్యాన పంటలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు పోతల సూర్యమణి, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, చిటికెల వరహాలబాబు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చోద్రాజు రాంబాబురాజు, ఎంపీడీఓ పి.రవికుమార్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా..



ప్రత్తిపాడు జెడ్పీ హైస్కూల్‌లో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ రాజరాజేశ్వరి

ఏలేశ్వరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ఉల్లాసంగా, ఉత్సాహంగా జరుగుతున్నాయి. పోటీల్లో భాగంగా బుధవారం రెండోరోజు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. మండలంలోని లింగంపర్తి, సిరిపురం, తిరుమాలి, యర్రవరం, పెద్దనాపల్లి తదితర గ్రామాల్లో మండలస్థాయి అధికారుల ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. గ్రామస్థాయిలో రాణించిన క్రీడాకారులు మండల, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.

క్రీడలతో శారీరక, మానసికోల్లాసం

ప్రత్తిపాడు: క్రీడలు మానసిక ఉల్లాసానికి, దేహదారుఢ్యానికి దోహదపడతాయని జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి అన్నారు. ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం ఆడుదాం.. ఆంధ్రా క్రీడా పోటీలను ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రాజరాజేశ్వరి మాట్లాడుతూ యువతలో అంతర్లీనంగా ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహిస్తోందన్నారు. క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పినిశెట్టి ప్రకాష్, ఆకుల వీరబాబు, చెలంకూరి రాజబాబు, యోగా గురు తాతపూడి బుజ్జి, పీడీ నైశెట్టి దేవీకుమారి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం

తుని: స్థానిక రోటరీ క్లబ్ భవనంలో శుక్రవారం ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు క్లబ్ తుని శాఖ కార్యదర్శి కిశోర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ డాక్టర్లు మహిళలు, పురుషులకు ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తారన్నారు. మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రజలు స్థానిక రెడ్ కాన్వెంట్ వీధిలోని రోటరీక్లబ్ కార్యాలయంలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

చేయూత మహిళా మార్ట్ వార్షికోత్సవం



ఎ.కొత్తపల్లి మహిళా మార్ట్‌లో కేక్ కట్ చేసిన మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సూర్యకాంతం

తొండంగి: మండలంలోని ఎ.కొత్తపల్లిలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చేయూత మహిళా మార్ట్ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు తక్కువ ధరలకే నిత్యావసర వస్తువుల అందించాలన్న లక్ష్యంతో డ్వాక్రా మహిళలు షేర్ హోల్డర్స్‌గా చేయూత మహిళా మార్ట్‌ను ప్రారంభించారని వెలుగు ఏపీఎం వై.సత్తిబాబు తెలిపారు. ఈ సందర్భంగా మార్ట్‌లో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, మార్ట్ చీఫ్ ప్రమోటర్ అద్దాల సూర్యకాంతం, ఇతర సభ్యులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. వినియోగదారులు, సిబ్బందికి గిఫ్ట్‌లు అందజేశారు. మార్ట్‌ను లాభాల బాటలో నడిపించిన సిబ్బందిని అభినందించారు. మార్ట్ ప్రమోటర్లు కె.సూర్యావతి, మంగ, మండల మహిళా సమాఖ్య కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు దాసుబాబు, విజయలక్ష్మి, సత్యవేణి, అప్పలకొండ, అకౌంటెంట్ శ్యామల, మేనేజర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

రౌతులపూడి: గౌరీదేవి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని మండలంలోని ఎస్.పైడిపాలలో బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. గ్రామస్తుల సహకారంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, వైఎస్సార్ సీపీ నాయకులు జిగిరెడ్డి సత్తిబాబు, రాయి ప్రసాద్, గొల్లు వెంకటరమణ, పారేపల్లి శ్రీరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలపై అవగాహన అవసరం



ఈవీఎం మెషీన్ పనితీరుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

ప్రత్తిపాడు: పోలీస్, సెలక్టోరల్ అధికారులకు పోలింగ్ కేంద్రాలపై అవగాహన అవసరమని బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, నియోజకవర్గ ఎన్నికల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎ. శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ సెలక్టోరల్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని 23 సెక్టార్లుగా విభజించామని, ఒక్కో సెక్టారుకు సెలక్టోరల్ అధికారిని నియమించినట్టు చెప్పారు. మరో ఇద్దరు సెలక్టోరల్ అధికారులను రిజర్వులో ఉంచామన్నారు. నియోజకవర్గాన్ని 31 రూట్లుగా విభజించి, రూట్ ఆఫీసర్లను కూడా త్వరలో నియమిస్తామన్నారు. పోలింగ్ మెషీన్లపై సాంకేతికపరమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. సెలక్టోరల్ అధికారుల, సెక్టార్ పోలీస్ అధికారుల విధి విధానాలను వివరించారు. ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో బ్యాలెట్ బాక్స్, వీవీప్యాట్, కంట్రోల్ యూనిట్‌లను ఏర్పాటు చేసే విధానం, వాటి పనితీరు, వాటి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రత్తిపాడు తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ వివరించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన అధికారి శ్రీనివాసరావు వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రత్తిపాడు సీఐ కె.శేఖర్‌బాబు, రౌతులపూడి తహసీల్దార్ జి.భీమారావు, ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సారా కేసులో నిందితుడికి రూ.20 వేల జరిమానా

ప్రత్తిపాడు: సారా కేసులో పలుమార్లు పట్టుబడిన నిందితుడికి తహసీల్దార్ రూ.20 వేల జరిమానా విధించినట్టు స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. కిర్లంపూడి మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన సలుగుల చిన్న పలు సారా కేసులో నిందితుడు. ఇతనిపై బైండోవర్ కేసులు నమోదు చేసినా సారా కేసుల్లో పట్టుబడడంతో బుధవారం సాయంత్రం కిర్లంపూడి తహసీల్దార్ కేవీ మాధవరావు వద్ద హాజరు పరచారు. తహసీల్దార్ రూ.20 వేలు జరిమానా విధించారు. సదరు సొమ్మును ప్రభుత్వానికి చలానా రూపంలో నిందితుడు చెల్లించినట్టు సీఐ అశోక్ తెలిపారు.

బెల్లపు ఊట ధ్వంసం

మండలంలోని వెంకటనగరం పంచాయతీ తోటపల్లి గిరిజన గ్రామంలో సారాబట్టీలపై బుధవారం స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) అధికారులు విస్తృతంగా దాడులు చేశారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సంఘటన స్థలం నుంచి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. పరారైన కోరాపు మల్లేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు స్థానిక సెబ్ సీఐ అశోక్ తెలిపారు. కాగా కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామానికి చెందిన అబ్బిరెడ్డి సూరిబాబును బైండోవర్ చేశారు. హెచ్‌సీలు కృష్ణార్జున, వెంకన్నదొర, సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా సర్కారీ స్కూళ్లు



తునిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న నాయకులు



బెండపూడి హైస్కూల్లో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తుని రూరల్: కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సాంకేతిక, డిజిటల్ విద్యను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువత అధ్యక్షుడు ఏలూరి బాలు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అధ్యక్షతన ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలు మాట్లాడుతూ వరుసగా నాలుగో సంవత్సరం ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌లను సమకూర్చిందన్నారు. ట్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండలంలో 1450 విద్యార్థులకు ఈ ఏడాది ట్యాబ్‌లు అందిస్తున్నట్టు ఎంఈఓ పరవాడ గీతాదేవి తెలిపారు. వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు, వైస్ చైర్మన్ పామర్తి మహేష్, వక్ఫ్‌బోర్డు జిల్లా వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, ఎంపీడీఓ పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

తొండంగి: మండలంలోని బెండపూడి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు బుధవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థులకు వైఎస్సార్ సీపీ నాయకులు మద్దుకూరి వీరవెంకట సత్యనారాయణ చౌదరి, ఆరుమిల్లి ఏసుబాబు చౌదరి ట్యాబ్‌లను అందజేశారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ సోమిశెట్టి చలపతి, పార్టీ నాయకుడు బూసాల గణపతి, ఎంపీటీసీలు గొంతెన నాగేశ్వరరావు, మళ్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివ ముక్కోటి పూజలు



తపోవనంలో శివ ముక్కోటి పూజలు చేస్తున్న పీఠాధిపతి సరస్వతీ మహాస్వామి



ధర్మవరంలో గోదాదేవి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



తాళ్లూరులో రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ

తుని రూరల్: కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో బుధవారం శివ ముక్కోటి పూజలు నిర్వహించారు. పాడ్యమిని పురస్కరించుకుని పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో వేద పండితులు, వేద విద్యార్థులు శివుడికి పంచామృతాభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పూలతో విశేషాలంకరణ చేశారు. ధనుర్మాసంలో శివ ముక్కోటి పూజలు చేయడం శుభప్రదమని పీఠాధిపతి సరస్వతీ మహాస్వామి పేర్కొన్నారు. వేదపండితులు, వేద విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

గండేపల్లి: తాళ్లూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శివ ముక్కోటి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వీఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రాజగోపాలస్వామి ఆలయంలో పూజలు

ప్రత్తిపాడు రూరల్: ధర్మవరంలోని రుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాలస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు గోదాదేవి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.